క్లుప్తంగా

త్వరలోనే నష్ట పరిహారం

అశ్వారావుపేటరూరల్: పెదవాగు వరద ముంపు బాధితుల్లో అర్హులైన ప్రతి రైతుకు త్వరలోనే నష్ట పరిహారాన్ని చెల్లిస్తామని, రైతుల వివరాలను సేకరించి నివేదికను పై అధికారులకు అందిస్తామని స్థానిక తహసీల్దార్ కృష్ణ ప్రసాద్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అర్హత ఉన్న రైతుల వివరాలు సేకరించి, వారి ఖాతాల్లో పరిహారం జమ అయ్యేలా చూస్తామని తహసీల్దార్ కృష్ణ ప్రసాద్ 'సాక్షి'కి ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు ఎవరూ పరిహారం విషయంలో ఆందోళన చెందవద్దని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

డొమెస్టిక్ సిలిండర్లు వినియోగిస్తే చర్యలు

చండ్రుగొండ: గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్లను హోటళ్లు, వ్యాపార కార్యకలాపాలకు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తగూడెం సివిల్ సప్లై డీటీ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. మంగళవారం ఆయన చండ్రుగొండలోని హోటళ్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని అన్నారు. అనంతరం స్థానిక గ్యాస్ ఏజెన్సీ కార్యాలయంలో రికార్డులు, గ్యాస్ సిలిండర్ల నిల్వలను పరిశీలించారు.

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

భద్రాచలంఅర్బన్: గత వారం రోజుల కురుస్తున్న భారీ వర్షాలకు భద్రాచలం ఏజెన్సీలోని అనేక గ్రామాల్లో విష జ్వరాలు విజృంభించి ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని, తక్షణమే భద్రాచలం ఏజెన్సీలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సీపీఎం భద్రాచలం పట్టణ కమిటీ సమావేశం ఎంబీ.నర్సారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడారు. పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బండారు శరత్ బాబు, సున్నం గంగా, వై.వెంకట రామారావు, పి.సంతోష్ కుమార్, నాదెళ్ల లీలావతి, తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ వాడొద్దు

దమ్మపేట: విధినిర్వహణలో ఉపాధ్యాయులు సెల్‌ఫోన్ వాడకూడదని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని గండుగులపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించి, ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో ఉపాధ్యాయులు అత్యవసరమైతే తప్ప సెల్‌ఫోన్‌లు వాడొద్దని, ఈ నిషేదం గండుగులపల్లిలోని ప్రభుత్వ పాఠశాలల నుంచే మొదలు పెట్టాలని ఉపాధ్యాయులతో తీర్మానం చేయించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

టీజేఎస్ సభ్యత్వ నమోదు

గుండాల: మండలంలో తెలంగాణ జన సమితి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు గోపగాని శంకర్రావు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలంలో సీనియర్ నాయకులకు పలువురికి శంకర్రావు పార్టీ క్రియాశీలక సభ్యత్వాలను అందజేశారు. ఖమ్మం జిల్లా కోఆర్డినేటర్ షేక్ సర్దార్, ఖమ్మం టౌన్ కో ఆర్డినేటర్ బెల్లంకొండ నాగేశ్వరావు, గుండాల మండల అధ్యక్షుడు గొల్లపల్లి రమేష్, గడ్డం రాములు, భద్రయ్య పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

ములకలపల్లి: భారతీయ జనతా పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు గుగులోతు శంకర్ పిలుపునిచ్చారు. ములకలపల్లిలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ మండల అధ్యక్షుడు అనుమల శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి పూనెం నవీన్, ఓబీసీ అధ్యక్షుడు రాంబాబు, కార్యదర్శి నర్సింహారావు, ఎస్సీ మోర్చా అధ్యక్షులు పాలకుర్తి ప్రసాద్, భానుతేజ, కిసాన్ మోర్చా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, వసంత్ పాల్గొన్నారు.

ఆత్మహత్యల నివారణ దినోత్సవం

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురంలోని మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మంగళవారం ఆశా డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆశా వర్కర్లు నెలవారీ లక్ష్యాలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ మాట్లాడారు. అనంతరం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ నిశాంత్‌రావు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

దుమ్ముగూడెం: మండలంలోని దుమ్ముగూడెం గ్రామంలోని 60 నిరుపేద కుటుంబాలకు సినీహీరో ఆదిత్య ఓం సహకారంతో పాకాల పాటి విజయవర్మ దుప్పట్లను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కెల్లా శేఖర్, గడ్డం బాలాజీ, పిలక వెంకటరమణరెడ్డి, ముసలి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

వీర వనిత చాకలి ఐలమ్మ వర్ధంతిని పలుచోట్ల మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ పార్టీలు, సంఘాల భవనాల్లో ఆమె చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం భావితరాలకు స్ఫూర్తిదాయకం అన్నారు. నాడు 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు ఆమె పంచినట్లు తెలిపారు. పలువురు అధికారులు, నాయకులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


దమ్మపేట: ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ


మణుగూరురూరల్: ఐలమ్మ చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు


దుమ్ముగూడెం: ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


అన్నపురెడ్డిపల్లి: ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్


అశ్వాపురం: కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో..


కరకగూడెం: ఐలమ్మ చిత్రపటం వద్ద తహసీల్దార్, ఉద్యోగులు


అశ్వారావుపేటలో నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు

మెరుగైన వైద్యం అందించాలి


చికిత్స పొందుతున్న వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: వానకాలం వ్యాధులు ప్రబలి ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో చికిత్సలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం 100 పడకల ఆస్పత్రిని ఆకస్మికంగా సందర్శించిన ఆయన.. అన్ని వార్డుల్లో సూపరింటెండెంట్ సునీల్‌తో కలిసి కలియదిరిగారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఓపీ పేషంట్ల వివరాలతో పాటు ఆస్పత్రిలో మెరుగైన వైద్య సదుపాయాల కోసం రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి అన్ని సమకూరుస్తామని తెలిపారు. పరీక్షలను తెలుసుకుని రికార్డులు పరిశీలించారు. ఇన్‌పేషంట్‌ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తాము పనిచేసిన 10 నెలల జీతం ఇవ్వకుండా కాంట్రాక్టర్ తిప్పుకుంటున్నాడని, పెండింగ్ జీతాలు ఇప్పించాలని ఎమ్మెల్యేకు సిబ్బంది విన్నవించగా, కాంట్రాక్టర్‌ని పిలిపించి మాట్లాడుతానని భరోసానిచ్చారు. వైద్యులు గౌరి, మండల అధ్యక్షుడు పిరినాకి నవీన్, గుడిపూడి కోటేశ్వరరావు, బాబు, రహీం పాల్గొన్నారు.

దాడులను అరికట్టాలి

భద్రాచలంటౌన్: దేశంలో మహిళలపై జరుగుతున్న ఆయా ప్రభుత్వాలు అరికట్టి మహిళా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కెచ్చెల కల్పన అన్నారు. పట్టణంలోని ప్రగతిశీల మహిళా సంఘం డివిజన్ కార్యాలయంలో మంగళవారం జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం మహిళా సంఘం నూతన డివిజన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా వై. సావిత్రి, కార్యదర్శిగా కొండ భవాని, డివిజన్ అధ్యక్షురాలిగా మునిగేలా మహేశ్వరి, ఉపాధ్యక్షురాలిగా వెంకట నర్సమ్మ, సహాయ కార్యదర్శిగా సిమిడి సుజాత, కోశాధికారి ఆర్ శారదతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. పలువులు నాయకులు పాల్గొన్నారు.

'పులుసు బొంత' కాలువ దిశను మార్చండి

కరకగూడెం: మండలంలోని నర్సాపురంపాడ్ గ్రామ పెద్దవాగుపై పులుసు బొంత ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్న క్రమంలో ప్రాజెక్టు సంబంధించిన కాలువ దిశను మార్చాలని కోరుతూ మండలంలోని పలు గ్రామాల గిరిజన రైతులు మంగళవారం మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రాజెక్టుకు సంబంధించిన ఓ కాలువ గిరిజన ఆదివాసీ పంట భూములపై కాకుండా పద్మాపురం నుంచి దేవర నాగారం, వీరాపురం అటవీ ప్రాంతం దిశగా వెళ్లాలని ఎమ్మెల్యేను వేడుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత శాఖ అధికారులతో చరవాణిలో మాట్లాడి ప్రాజెక్ట్ కాలువల పూర్తి వివరాలు తనకు అందజేయాలని ఆదేశించారు. విన్నవించిన వారిలో ఆదివాసీ సంఘాల నాయకులు, రైతులు గోగ్గల రవి, చందా లక్ష్మీనారాయణ, పోలెబోయిన రుక్మారావు,నాలి రామకృష్ణ, గొగ్గలి వెంకటేష్, కొమరం సమ్మయ్య, కొమరం శ్రీను,ముసలయ్య, కొమరం సత్యం, కొమరం స్వామి పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ


నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు

మణుగూరుటౌన్: ఇటీవల వర్షాలకు వరదలకు నిరాశ్రయులైన మున్సిపాలిటీ, మండల నిరుపేదలకు మణుగూరు చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో మంగళవారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. మద్దులగూడెంలోని 50 కుటుంబాలకు, సమితిసింగారంలోని 10 కుటుంబాలకు, కూనవరం రైల్వే గేట్ వద్ద 20 కుటుంబాలకు చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు దోసపాటి నాగేశ్వరరావు, దండా రాధాకృష్ణ చేతుల మీదుగా నిత్యావసరాలు పంపిణీ చేశారు. బులియన్ అసోసియేషన్ సభ్యులు వెచ్చా చంద్రశేఖర్, క్లాత్ అసోసియేషన్ సతీష్, రాము, బాంబే క్లాత్ వెంకటేశ్వరరావు, కిరాణా అసోసియేషన్ బాలు, ఐరన్ అసోసియేషన్ రాజు, హోటల్ అసోసియేషన్ వందనపు వాసు, మౌనిక రెస్టారెంట్ రెడ్డి, ఫ్యాన్సీ అండ్ మెటల్ అసోసియేషన్ వెంకటేశ్వర్లు, మెడికల్ అసోసియేషన్ నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

నిమజ్జనంలో జాగ్రత్తలు పాటించాలి

మణుగూరురూరల్: నాయకచవితి ఉత్సవాలను పురస్కరించుకుని గణేష్ నిమజ్జన కార్యక్రమాల్లో జాగ్రత్తలు పాటించాలని మణుగూరు సీఐ సతీష్‌కుమార్ సూచించారు. మంగళవారం ఆయన మణుగూరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో గణపతి ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గణేష్ నిమజ్జనాలకు కొండాయిగూడెం గోదావరి ప్రాంతంలో అన్ని ఏర్పాట్లు చేశామని, అయితే గోదావరి ఉధృతి నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలని అన్నారు. గణపతి విగ్రహాలను ఎక్కడ పడితే అక్కడ నిమజ్జనం చేయరాదని, పోలీస్, పంచాయితీరాజ్, రెవిన్యూశాఖల సమక్షంలో సూచించిన ప్రాంతంలోనే గణపతులను నిమజ్జనం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉత్సవ కమిటీల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో ప్రతిభ

దుమ్ముగూడెం: తెలంగాణ ప్రజాకవి కాళోజీ నారయణరావు జయంతి సందర్భంగా తెలంగాణా భాషా దినోత్సవంలో భాగంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో రేగుబల్లి బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు రాణించారు. భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో రేగుబల్లి పాఠశాలకు చెందిన 9వ తరగతికి చెందిన కొట్టెం కీర్తన మొదటి బహుమతి, 9వ తరగతికి చెందిన ఉబ్బా సునీత ద్వితీయ బహుమతి, 10వ తరగతికి చెందిన కుంజా సమీర మూడవ బహుమతి పొందినట్టు హెచ్‌ఎం సావిత్రి తెలిపారు. విద్యార్థులను తెలుగు ఉపాధ్యాయురాలు సరోజిని, ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు.

13న కంటి వైద్య శిబిరం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 13న ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘం ప్రెసిడెంట్ భూషన్‌రావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన మెడివిజన్ ఆస్పత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించి కంటి ఆపరేషన్ అవసరమైన వారిని ఆస్పత్రికి తరలించి ఉచితంగా చేస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, హెల్త్ కార్డు కలిగిన వారు పరీక్షలు చేయించుకోవచ్చని పేర్కొన్నారు.

వైద్య శిబిరం

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని అబ్బుగూడెం గ్రామంలో సోమవారం నిర్వహించిన వైద్య శిబిరంలో గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. రోగులకు ఉచితంగా మందులను అందజేశారు. మండల వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు సుశీల, జయలక్ష్మి, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

భద్రాచలంటౌన్: పినపాక మండలానికి చెందిన దళిత మహిళ కోడి రెక్కల స్వప్న మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అల్లాడి పాల్ రాజ్ మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దళిత సంఘాలను ఏకం చేసి దశలవారీ ఉద్యమాలు చేపడతామని తెలిపారు.

గణేష్ నిమజ్జనం


కరకగూడెం: మండలంలోని పలు గ్రామాల్లో కొలువుదీరిన గణనాథులు గత మూడు రోజులుగా విశేష పూజలు అందుకుని మంగళవారం నిమజ్జనానికి కమిటీ సభ్యులు తరలించారు. ఈ సందర్భంగా కరకగూడెం గ్రామంలో పురగిరి క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం లడ్డులను వేలంపాట వేసి గణేశ్‌మహారాజ్‌కి జై.. అంటూ నినాదాలు చేశారు. స్థానిక చెరువుల్లో గణనాథులను నిమజ్జనం చేశారు.

సమస్యలు పరిష్కరించాలి

మణుగూరురూరల్: మండలంలోని మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇఫ్టూ ఆధ్వర్యంలో మంగళవారం ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇఫ్టూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.మధుసూధన్‌రెడ్డి, షేక్ యాకుబ్‌షావలిలు మాట్లాడుతూ.. గత నాలుగు నెలలుగా కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదని అన్నారు. ఇఫ్టూ జిల్లా ఉపాధ్యక్షుడు గోనెల రమేష్, ఏరియా కార్యదర్శి మల్సూర్, వైద్యశాల కమిటి నాయకులు సంధ్య, మని, యూసీ, ముత్తయ్య, జోష్ణ, మీనా పాల్గొన్నారు.

భూములు ఆక్రమిస్తే చర్యలు

గుండాల: మండలంలో ప్రభుత్వ భూములు, చెరువు, కుంటలకు సంబంధించి భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ ఇమ్మానుయేల్ అన్నారు. మంగళవారం బతుకమ్మ ఘాట్ వద్ద ఆక్రమణకు గురైన చెరువు భూమిని స్వాధీనం చేసుకున్నారు. మండల కేంద్రంలోని బతుకమ్మ, వినాయక విగ్రహాలు నిమజ్జనం చేసే స్థలాన్ని స్థానికులు ఆక్రమించుకున్నారు. దీంతో గ్రామస్తుల ఫిర్యాదు మేరకు తహసీల్దార్, సీఐ రవీందర్, ఎస్సై రాజమౌళి అక్కడికి చేరుకుని పరిశీలించారు. చెరువులోకి వెళ్లే దారిని వెంటనే స్వాధీనం చేసుకుని హద్దులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బఫర్ స్థలాలు, శిఖం భూములను ఆక్రమిస్తే వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.


ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గ్రామాల్లోకి గోదారి వరద

దుమ్ముగూడెం: మండలంలో కురిసిన వర్షాలతో పాటు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో దుమ్ముగూడెం, పర్ణశాల, కాశీనగరం, సున్నంబట్టి గ్రామాల దగ్గర గోదావరి ఉధృతిగా ప్రవహిస్తుంది. గోదావరి వరద పెరగడంతో బైరాగులపాడు–సున్నంబట్టి రహదారి మీదకు వరద నీరు చేరి రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే పర్ణశాల నారచీరల ప్రాంతం అంతా వరద నీటితో పూర్తిగా నీట మునిగింది. వరద నీటి తాకిడితో తూరుబాక దగ్గర భద్రాచలం–చర్ల ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టు దగ్గర మట్టి కుంగి పోయి గొయ్యి ఏర్పడింది. ప్రమాదం జరుగకుండా పంచాయతీ అధికారులు ముందస్తుగా బారికేడ్‌లను ఏర్పాటు చేశారు.

నిలిచిన రాకపోకలు..

అశ్వాపురం: గోదావరి వరద పెరగడంతో మండల పరిధిలోని అమెర్ద–అమ్మగారిపల్లి రహదారిపై మంగళవారం వరదనీరు చేరింది. దీంతో రెండు గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. అమ్మగారిపల్లి, అమెర్ద, పాములపల్లి, చింతిర్యాల, ఆనందాపురం గ్రామాల్లోని వాగుల్లో గోదావరి వరదతో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.


దుమ్ముగూడెం: బైరాగులపాడు-సున్నంబట్టి గ్రామాల మధ్య చేరిన వరద నీరు


దుమ్ముగూడెం: పర్ణశాలలో నీటమునిగిన నారచీరల ప్రాంతం

పరీవాహక ప్రాంతాలకు అలెర్ట్

పినపాక: మండల పరిధిలోని గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలు భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని పినపాక తహసీల్దార్ సూర్యనారాయణ సూచించారు. ఈ మేరకు అయన మంగళవారం ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ వెంకటేశ్వరరావుతో కలిసి గోదావరి పరివాహక ప్రాంతంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ.. గోదావరి పెరుగుతున్న నేపథ్యంలో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, చేపల వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు. ఎటువంటి ఇబ్బందులున్నా అధికారులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పలు శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: గోదావరి పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మణుగూరు తహసీల్దార్ రాఘవరెడ్డి సూచించారు. మంగళవారం ఆయన కమలాపురం, చినరాయిగూడెం గ్రామాలను సందర్శించి అక్కడి ప్రజలను అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కురుస్తున్న వర్షాల కారణంగా గోదావరి ఉధృతి పెరుగుతోందని, ఇప్పటికే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అయిందని తెలిపారు. ముంపు సంభవించడానికి ముందే ప్రజలు జాగ్రత్త పడి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ లీలావతి, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న వైద్యాధికారిణి మధులిక

అశ్వారావుపేటరూరల్: విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో జ్వరాలు ప్రబలే అవకాశాలు అధికంగా ఉంటాయని, జ్వరాలపై క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ మధులిక అన్నారు. మంగళవారం మండలంలోని గుమ్మడవల్లి పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎం, సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ.. ప్రతి రోజు గృహ సందర్శనలు చేసి, ఆరోగ్య వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. జ్వరాలతో ఉన్న వారిని గుర్తిస్తే తక్షణమే సమాచారం అందించి వైద్య సేవలు పొందే విధంగా చూడాలన్నారు. సమావేశంలో సిబ్బంది భాస్కర్, ఏఎన్‌ఎంలు విజయలక్ష్మి, స్వరూప, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 సంవత్సరానికిగాను అతిథి అధ్యాపకుల నియామకానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.జాన్ మిల్టన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో బోటనీ-1, కామర్స్-3, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్-3, ఎకనామిక్స్-1, హిస్టరీ, ఇంగ్లీష్-2, పొలిటికల్ సైన్స్-2, జువాలజీ-1, తెలుగు-2 ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 12వ తేదీ ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు దరఖాస్తులను కళాశాల కార్యాలయంలో అందజేయాలని, 13వ తేదీ ఉదయం 10 గంటలకు జరిగే ఇంటర్వ్యూకు ఒరిజనల్ సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలని తెలిపారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్ట్‌లో పీజీలో 55 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు పొంది ఉండాలని సూచించారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

బూర్గంపాడు: ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కృష్ణసాగర్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ధర్మాచారి కోరారు. మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో వివిధ ట్రేడ్‌లలో ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థులు ఈ నెల 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు రిజిస్ట్రేషన్‌లు చేయించుకోవాలని తెలిపారు. సీటు కావాలనుకునే ఐటిఐలలో ఒరిజనల్ సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలని కోరారు.

నేడు బస్‌పాస్‌ల శిబిరం

ములకలపల్లి: దివ్యాంగులకు కొత్తగూడెం డిపో మేనేజర్ మలగం దేవేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో నేడు ప్రత్యేక బస్‌పాస్ శివిరం ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు ఇసంపల్లి శ్యామ్యూల్, బి.నరేందర్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలకేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంక్ ఎదుట ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండల పరిధిలోని దివ్యాంగులు తమ ఆధార్ కార్డు, సదరం సర్టిఫికేట్‌ల జిరాక్స్‌లతోపాటు, పాస్‌ఫొటో, ఆన్‌లైన్ ఖర్చుల నిమిత్తం రూ.50 తమ వెంట తెచ్చుకోవాలని సూచించారు. శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు.

సింగరేణి అప్రెంటిస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మణుగూరుటౌన్: సింగరేణి యాజమాన్యం 2024–25 సంవత్సరంలో వివిధ ట్రేడ్‌లు ఐటీఐ(ఎన్‌సీవీటీ) అభ్యర్థులు ఏడాది కాలం వ్యవధితో కూడిన అప్రెంటిస్ షిప్‌కు నోటిఫికేషన్ ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వారు జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఈ నెల 7వ తేదీ నుంచి నైపుణ్య శిక్షణకు ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, టర్నర్, మోటార్ వెహికల్, మెకానికల్, డ్రాఫ్టమెన్ శిక్షణకు దరఖాస్తులు 28 సంవత్సరాల వయో పరిమితి కలిగిన అభ్యర్థుల నుంచి ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. మణుగూరు ఏరియా సింగరేణి ఉద్యోగులు, వారసులు, ప్రభావిత ప్రాంతాల పిల్లలు, నిర్వాసిత కుటుంబాలకు చెందిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పౌష్టికాహారం సక్రమంగా అందాలి


అన్నపురెడ్డిపల్లి: చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీఓ సలోమి


భద్రాచలంఅర్బన్: అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనసూయ

భద్రాచలంఅర్బన్: మహిళలు, బాలికల్లో రక్తహీనత నివారణ, పిల్లల ఎదుగుదలకు అవసరమైన పోషకాహారం సక్రమంగా అందేటట్లు చూడాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనసూయ తెలిపారు. పట్టణంలోని ముదిరాజ్ బజార్‌లోని అంగన్‌వాడీ పాఠశాలలో దుమ్ముగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మహిళలు, పిల్లల రక్షణ చట్టాలు, హక్కులు, పోషకాహారం సరఫరాపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. టీచర్ విజయమ్మ, తల్లులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: అంగన్‌వాడీ కేంద్రాలు పోషకాహార నిలయాలని సీడీపీఓ సలోమి అన్నారు. మంగళవారం మండలంలోని రాజాపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణమాసంలో ఆమె పాల్గొని, నలుగురు చిన్నారులకు అక్షరాభ్యాసం జరిపించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.